సజీవంగా మహనీయుడి స్ఫూర్తి

- పునఃప్రారంభమైన గాంధీహిల్ ప్లానిటోరియం
- ఖగోళ విజ్ఞానాన్ని అందిస్తున్న నక్షత్ర ప్రదర్శనశాల


గాంధీహిల్‌లోని ప్లానిటోరియం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గాంధీజీ స్ఫూర్తిని అందించే గాంధీహిల్‌పై ఉన్న ప్లానిటోరియం (నక్షత్ర ప్రదర్శన శాల) అందరినీ అబ్బురపరుస్తుంది. విజయవాడ నగరానికి గాంధీహిల్ ప్లానిటోరియం తలమానికంగా నిలుస్తుంది. విజయవాడ పర్యాటక ప్రాంతాల్లో ఇది ఒకటిగా పేర్కొంటారు. స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మంది భారతీయులకు మార్గదర్శకం చేసిన మహనీయుడు మహాత్మా గాంధీ. ఆ మహనీయుడి స్ఫూర్తిని భవిష్యత్ తరాల్లో సజీవంగా నిలిపేందుకు, ఆయన అడుగుజాడలను కొనసాగించేందుకు విజయవాడలో ఏర్పాటు చేసిన స్మారక ప్రాంతమే గాంధీహిల్. రైల్వేస్టేషన్‌కు పశ్చిమాన సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండపై గాంధీ స్మారక కేంద్రాన్ని 1968లో ప్రారంభించారు.

1971లో ప్లానిటోరియం ఏర్పాటు....

ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు కృషి ఫలితంగా గాంధీకొండపై 1971 జూన్ 19న అప్పటి ఉపరాష్ట్రపతి గోపాల్ స్వరూప్ పాఠక్ చేతుల మీదుగా నక్షత్రశాలను ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో తొలిగా ఏర్పాటు చేసిన నక్షత్ర ప్రదరనశాల ఇదే. అనంతరం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇటువంటి ప్రదర్శన శాలలు ఏర్పాటయ్యాయి. ఇటీవల కొంత కాలం మరమ్మతులు పేరుతో మూసివేసినా గత ప్రభుత్వం నిధులు కేటాయించి దీనిని మరింత అందంగా ఆధునికీకరించింది. అధికారికంగా ఇటీవల దీనిని పునఃప్రారంభించారు.

అంతరిక్షరరిజ్ఞానాన్ని అందించేలా....

అంతరిక్షంలోని నక్షత్రాలు, వివిధ గ్రహాలు సంచారం, వాటివలన కలిగే ప్రయోజనాలు తదితర అంశాలను ఈ ప్లానిటోరియంలో చక్కగా వివరిస్తారు. ప్రధానంగ ఖగోళ, అంతరిక్ష పరిజ్ఞానానికి సంబంధించి పలు విషయాలను దీనిలో ప్రదర్శించి సందర్శకులకు వివరిస్తారు. చిన్నారులకు ఇదొక గొప్ప అనుభూతి. అంతరిక్ష విజ్ఞానాన్ని తెలుసుకునేందుకు చిన్నారులకు ఒక మంచి సాధనం. నగరంలో సుమారు ఐదున్నర దశాబ్దాలుగా అంతరిక్ష విజ్ఞానాన్ని అందించే గొప్ప కేంద్రంగా గాంధీహిల్ ప్లానిటోరియం కొనసాగుతోంది.

సాయంత్రం నాలుగు గంటల నుంచి.....

ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్లానిటోరియం అందుబాటులో ఉంటుంది. కనీసం పది మంది టిక్కెట్లను కొనుగోలు చేస్తే ప్లానిటోరియంలో ప్రదర్శన ప్రారంభమవుతుంది. ప్రజలందరికీ అందుబాటులో ఉండేందుకు రూ.40 రూపాయలు ప్రవేశ టికెట్‌గా నిర్ణయించారు. 63 సీటింగ్ కెపాసిటీ గల ప్లానిటోరియంను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో, పాఠశాలల నుంచి ప్రత్యేక బుకింగ్ చేసుకున్న వారికి 50 శాతం ప్రవేశ రుసుంలో రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. బుధవారం నుంచి ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ప్రతి అరగంటకు షో వేస్తారు. పాఠశాలలు, కళాశాలలు నుంచి ప్రత్యేకంగా బుకింగ్స్ చేసుకున్న వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు బుకింగ్ చేసుకున్న సమయంలో షో వేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతి మంగళవారం నిర్వహణ కోసం ప్లానిటోరియంకు శెలవు ఉంటుంది.


ప్లానిటోరియంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు


లోపల ఉన్న సీటింగ్

సూరాయిపాలెంలో పశు వైద్య శిబిరం


పశు వైద్య శిబిరంలో పాడి రైతులు, బొమ్మసాని, వైద్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స కేంద్రాన్ని గొల్లపూడి పంచాయతీ పరిధిలోని సూరాయిపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. పశుగణ అభివృద్ధి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు పాడి గేదెల రైతులతో కలిసి నిర్వహించిన ఈ చికిత్స శిబిరంలో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్న 49 గేదెలు, 12 ఆవులను పరీక్షలు చేసి నివారణకు అవసరమైన మందులు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పశువుల పోషణపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పశువులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని చెప్పారు. పశువులు రోడ్లుపై ఉండే ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగ్స్ వంటి వాటిని తినటం వలన గర్భకోశ వ్యాధులకు గురవుతున్నాయని తెలిపారు. అటువంటివాటిని తినకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశుపోషణ యాజమాన్య పద్ధతుల గురించి వివరిస్తూ పాడి పశువులను స్థానికంగా ఉండే పశువైద్యాధికారుల పరిరక్షణలో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు ప్రారంభించగా నర్రా వాసు, పశు వైద్యాధికారులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విజేతలతో నిర్వాహకులు, అతిథులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో జీకే గోజూరియో కరాటే అకాడమీ (జీకేఎ) సత్యనారాయణపురం బ్రాంచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజయవాడ పటమటలోని చెన్నుపాటి రాయకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో సత్యనారాయణపురం బ్రాంచి విద్యార్థులు బి.హిటామశ్రీ (11), బి.ఆద్య శ్రీ (9), వై.వరుణ్ (9), వై.లీలానాథ్ (10), జి.సహస్ర (13) ప్రథమ స్థానంలో గెలుపొందారు. ద్వితీయ స్థానంలో ఎస్‌కె అయాన్ (10), జి.క్షేత్రజ్ఞ (10), కె.లీలాకృష్ణ (11) నిలిచారు. టోర్నమెంట్‌ను డాక్టర్ యు.బ్రహ్మానందం, యు.విజయ కుమార్, కె. శ్రీనివాస్, సీహెచ్ పూర్ణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, అతిథులుగా జేకే జీకేఎ వ్యవస్థాపకులు జె. శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను జేకే జీకేఎ సత్యనారాయణపురం బ్రాంచి హెడ్ కోచ్ పీకేకెఎస్ హర్ష, ఇతర బ్రాంచిల కోచ్‌లు టీవీ సాయి కుమార్, నరసింహ అభినందించారు.

విద్వేష రాజకీయాలు తగదు!

ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): అధికార గర్వంతో రాజ్యాంగ పునాదులను పెకలించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని, దేశ భవిష్యత్ దృష్ట్యా ఇలాంటి చర్యలను ప్రజలు గమనించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్ అన్నారు. ఆయన లబ్బీపేటలోని తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. వాస్తవానికి దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల మధ్య ఐక్యత సోదరభావం దృఢంగా ఉందన్నారు. కానీ గత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు ఆశించి, ఆ ఫలితాలు రాకపోవడంతో విభజన రాజకీయాలు లేపటం, వాటినే శాశ్వతంగా కొనసాగించే ప్రయత్నం చేయడం అనైతికమని చెప్పారు. ప్రార్థనా మందిరాల పరిరక్షణ చట్టం 1991 వర్షిప్ యాక్ట్ ప్రకారం 1947 ఆగస్టు 15 నాటి మతపరమైన ప్రదేశాల స్థితిని యథాతథంగా కొనసాగించాలన్నారు. ప్రార్థనా స్థలాన్ని మరొక మత స్థలంగా మార్చడాన్ని ఈ చట్టం నిషేధిస్తోందని చెప్పారు. ఇలాంటి నిషేధిత అంశాలపై విచారణ పేరుతో న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు వేయడం, వాటిపై వత్తిడి పెంచడం దురదుష్టకరమన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 30(1) ఎవరి మత సంస్థలను వారు స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించుకునే సౌలభ్యం రాజ్యాంగం కల్పించిందని ఆయన పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని గుర్తు చేసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లుకు ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ట్రాఫిక్ సమస్యలను సృష్టించి వాహనాల రాకపోకలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తెలిపారు. వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్సు, ఆటోకి సంబంధించిన పత్రాలు కలిగి ఉండటమే కాకుండా యూనిఫాం విధిగా ధరించాలని సూచించారు. ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, ఆటోల్లో పరిధికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు సూచించారు. ప్రతి డ్రైవర్ తమ ఆటోపై సీరియల్ నంబర్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆటో ఎక్కే మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులు ఆటోల్లో మర్చిపోయిన వస్తువులు దగ్గరలోని పోలీస్ స్టేషన్ అందజేయాలన్నారు. ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మైనర్లకు అద్దె ఆటోలు ఇచ్చే ఓనర్లు పైన సైతం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఆటోలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కేజీ మార్కెట్, గద్ద బొమ్మ సెంటర్‌లో ఆటోలు ఇబ్బడి ముబ్బడిగా నిల్పకుండా వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్క డ్రైవర్ పాటించాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌ఐ బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మాంటిస్సోరి చిల్డ్రన్స్ స్కూల్ 1988 - 89 బ్యాచ్ విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వారంతా మూడున్నర దశాబ్దాల కిందట కలిసి చదువుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడిన వారందరూ ఆదివారం ఒక చోట కలుసుకున్నారు. దీంతో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మహాత్మాగాంధీ రోడ్డు పున్నమ్మ తోటలోని చిల్డ్రన్స్ మాంటిస్సోరి స్కూలులో 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఓ హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన బాల్య మిత్రులు అంతా కుటుంబాలతో సహా ఒకచోట చేరి సందడి చేశారు. చాలా సంవత్సరాల తరువాత కలిసిన మిత్రులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఆనంద భాష్పాలు విడిచారు. ఎన్నెన్నో ముచ్చట్లు చెప్పుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను మరల గుర్తు తెచ్చుకుని మురిసిపోయారు. తమ కుటుంబ సభ్యులను ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. ఫోను నంబర్లు పంచుకున్నారు. పని వత్తిడి వలన హాజరు కాలేకపోయిన మిగిలిన మిత్రులను కూడా తలచుకున్నారు. కుదిరిన వారితో ఫోనులో మాట్లాడి సంతోషపడ్డారు. తాము కోల్పోయిన కొంతమంది మిత్రులను తలచుకుని బాధపడ్డారు. వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. అదే సమయంలో తమకు బడిలో పాఠాలే కాకుండా జీవిత పాఠాలు కూడా నేర్పిన నాటి టీచర్లు ప్రమీలా రాణి, సాయిబాల, పద్మావతి, సరోజిని, కనకదుర్గ, ఝాన్సీలను సమావేశానికి ఆహ్వానించి ఆత్మీయంగా సత్కరించుకున్నారు. ఈ మధ్యనే డాక్టరేట్ సాధించిన తమ తోటి విద్యార్థి రామచంద్రరావును సన్మానించి అభినందనలు తెలియజేశారు. రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆటపాటలతో గడిపి మరలా భారమైన హృదయాలతో వెనుదిరిగారు. మరలా త్వరలోనే కలుసుకోవాలని నిర్ణయించారు.

గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు


మాట్లాడుతున్న శివప్రసాద్, వేదికపై గోళ్ల నారాయణరావు, లక్ష్మి తదితరులు

విజయవాడకల్చరల్: గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలుగా భావించాలని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో గోపాలరెడ్డి రోడ్డులోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు చైతన్య వేదికలుగా ఉండేవని, నేడు అటువంటి పరిస్థితి లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే గ్రంథాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థలో మార్పుల కోసం అరసం కృషి చేస్తోందన్నారు. గ్రంథాలయోద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. గ్రంథాలయాలకు యువతను రప్పించడానికి ప్రణాళికలు తయారు చేయలన్నారు. సమావేశంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహర్ నాయుడు, అధ్యక్షుడు పి.లక్ష్మయ్య, కార్యదర్శి జి.లక్ష్మి, బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు ఎస్.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అక్కినేని శత జయంతి సభ

విజయవాడకల్చరల్: మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ అక్కినేని జీవిత విశేషాలను వివరించారు. ఆల్ ఇండియా అక్కినేని ఫ్యామిలీ అధ్యక్షుడు సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడు అక్కినేని అని, ఆయన కుటుంబమంతా చిత్రసీమకే అంకితమైందన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతి రావు సభను రంజకంగా నిర్వహించారు. దేవు నరసింహారావు రూపొందించిన డాక్టర్ ఏఎన్ఆర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా అక్కినేని పాటల సినీ సంగీత విభావరి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అక్కినేని అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మయూర్ నాథ్, కృష్ణ ప్రసాద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కనుల విందుగా ట్రీ లైటింగ్



గుణదల(విజయవాడతూర్పు): ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ పండుగను గుర్తు చేస్తూ విజయవాడ నోవోటెల్ హోటల్‌లో ట్రీ లైటింగ్ కార్యక్రమం ఆదివారం కనుల పండుగగా జరిగింది. విద్యుత్ దీప కాంతులతో క్రిస్మస్ ట్రీలను అలంకరించి, సందడి చేశారు. ఈ సందర్భంగా హోటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అఖిల్ మాట్లాడుతూ.. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆహార ప్రియులకు కావలసిన పదార్థాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ముందుగా వచ్చే క్రిస్మస్ పండుగకు పలు రకాల కేక్‌లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులకు, యాత్రికుల అభిరుచికి అనుగుణంగా వేడుకల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ట్రీ లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ 159 సచివాలయం పరిధిలోని సీఎస్ఐ చర్చి వీధిలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ పనులను స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, పార్టీ రాష్ట్ర నాయకులు షేక్ హయాత్ షరీఫ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గత ప్రభుత్వం హయాంలో సుమారు ఐదు కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు కేటాయించిన రూ.20 లక్షల నిధులలో మంజూరైన రూ.12 లక్షలతో స్థానికులు కోరిక మేరకు ఇక్కడ సీసీ రోడ్ నిర్మిస్తున్నామని తెలిపారు. రోడ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించామని తెలిపారు. ప్రతి పక్షంలో ఉన్నప్పటికీ డివిజన్ ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పాల్గొన్నారు.

భగవంతం కథలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు



విజయవాడకల్చరల్: కథా రచయిత భగవంతం కథలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని విఖ్యాత రచయిత వాడ్రేవు వీరలక్ష్మీదేవి అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో ఆదివారం భగవంతం కథల సంపుటి లోయ చివరి రహస్యం, శీరంశెట్టి కాంతారావు నవల పరంపర పరిచయ సభను నిర్వహించారు. వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. ప్రయోగాత్మకమైన కథలు రాయడంలో భగవంతం ముందు వరుసలో ఉంటారన్నారు. ఆయన కథలన్నీ వర్తమాన సంక్లిష్ట జీవిత రూపకాలు అని వివరించారు. శీరంశెట్టి కాంతారావు నవల గురించి యువ కవి అనిల్ డ్యానీ ప్రసంగించారు. పరిచయ సభలో సాహితీ వేత్తలు బాలాంత్రపు ప్రసూన, బండ్ల మాధవ రావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సద్గురువులకు స్వర నీరాజనం



విజయవాడకల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు వాగ్గేయకారుడు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి సందర్భంగా గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వంశానికి చెందిన సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ సద్గురువులకు స్వర నీరాజనాలు అందించారు. స్వీయ రచన వర్ణంతో ప్రారంభించి ఈ వసుధ, అప్పరామ భక్తి తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై మల్లాజోస్యుల శివ తేజ, మృదంగంపై కుందుర్తి అరవింద్, ఘటంపై హరిబాబు సహకరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు.

మానవ జాతికి దివ్యమార్గం అందించేది భగవద్గీత



విజయవాడకల్చరల్: మానవ జాతికి దివ్య మార్గం అందించేది భగవద్గీత అని ఆధ్యాత్మిక వేత్త రాఘవ గోస్వామి అన్నారు. అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా అయోధ్యనగర్‌లోని హైందవి కార్యాలయంలో బాల బాలికలకు భగవద్గీత శ్లోక పఠన కార్యక్రమం నిర్వహించారు. రాఘవ గోస్వామి మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు ఈ నాటికి.. ఏ నాటికి ప్రమాణంగా నిలిచేది భగవద్గీత మాత్రమేనన్నారు. రామరాఘవ దాసు మాట్లాడుతూ స్వ ధర్మం శ్రేయస్కరమని, ఆచరణీయమైనది స్వధర్మం ప్రమాదంలో పడినప్పుడు ఏయుగంలోనైనా అవతరిస్తానని భగవంతుడు వివరించాడన్నారు. భగవద్గీత నిత్య పఠనీయ గ్రంథం కావాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని భగవద్గీత శ్లోకపఠనం చేశారు. లక్ష్మీనారాయణ, పద్మావతి గీత మన గీత మారుస్తుందని తెలిపారు. విద్యార్థులకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమాలను నాగలక్ష్మి, సరస్వతి నిర్వహించారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అలరించిన ఆంధ్రనాట్య ప్రదర్శనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన రాజేశ్వరి నృత్య నికేతన్ బృందం ఆదివారం ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నాట్యాచారిణి ఆర్‌యస్‌వై రాజేశ్వరి నేతృత్వంలో చిన్నారి కళాకారిణులు తిలోత్తమ బాయి, లక్ష్మీ చైత్ర, తనుశ్రీ, రిషిత, ఉషారాణి, పియూష, హస్విక, నవ్య, హర్షప్రియ, భవానీ తదితరులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రనాట్యంలో అలరింపు, వినాయక కౌతం, దశావతారాలు, థిల్లాన, సంధ్య సమయం, వేణుగాన రవంబు, ముద్దుగారే యశోద, జయ జగజ్జనని అంశాలకు చక్కని హావభావాలతో అభినయిస్తూ నర్తించి భక్తుల హర్షధ్వానాలను అందుకున్నారు. కార్యక్రమానికి ధూపాటి శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ శాస్త్రి కళాకారులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. అనంతరం వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

సాంస్కృతిక, సాహిత్య వికాసానికి అరసం కృషి



విజయవాడకల్చరల్: సాంస్కృతిక, సాహిత్య వికాసానికి అభ్యుదయ రచయితల సంఘం కట్టుబడి ఉందని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన దేవీ ప్రియ కవితా సంపుటి, రేవతీదేవి కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని మొగల్రాజపురంలోని శిఖరా స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అభ్యుదయ రచయితల సంఘానికి సుదీర్ఘమైన సాహిత్య చరిత్ర ఉందన్నారు. మరుగున పడిన అనేక గ్రంథాలను వెలుగులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. దేవీ ప్రియ కవితను ఖాదర్ మొహిద్దీన్ ఆవిష్కరించారు. సంపాదకుడు బండ్ల మాధవరావు మాట్లాడుతూ దేవీ ప్రియ కవిత్వంలో సామాజిక చిత్రీకరణ కనిపిస్తోందన్నారు. రేవతీదేవి కవితా సంపుటిని కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత పి.సత్యవతి ఆవిష్కరించారు. సాహితీ వేత్త బాలాంత్రపు ప్రసూన కవితా సంపుటి విశేషాలు వివరించారు. అరసం కీలక బాధ్యులు వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ.. ఈ తరం కోసం అరసం కృషి చేస్తోందన్నారు. అరసం జిల్లా కార్యదర్శి పరచూరి అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

నందిగామ టౌన్: హిందూ ఆలయాలు, ఆస్తులు పరిరక్షణ నిర్వహణలో చేయాల్సిన సంస్కరణలపై హిందువులు ఏకం కావాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ వ్యవస్థాపక ప్రముఖ్ దివ్వెల కృష్ణ తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ముక్కోటి మహా మండపంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం సమీపంలోని గ్రీన్‌మెడోస్ స్థలంలో జనవరి ఐదున నిర్వహిస్తున్న హైందవ శంఖారావం బహిరంగ సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.